

జిల్లాకు చేరిన ఎల్లెల్సీ నీరు

హాలహర్వి: తుంగభద్ర డ్యాం నుంచి ఎల్లెల్సీకి వదిలిన నీరు సోమవారం జిల్లా సరిహద్దుకు చేరాయి. చింతకుంట గ్రామం వద్ద జలవనరుల శాఖ ఇంజినీర్లు పూజలు చేశారు.



దేవనకొండ పీహెచ్‌సీ తనిఖీ

దేవనకొండ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీపీఎం డాక్టర్ ఉమ, డీపీఓ విజయరాజు సోమవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలపై ఆరా తీశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,625.49
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:78.106
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:43,223
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:36,345

న్యూస్‌రీల్

ముగ్గురికి కారుణ్య నియామకాలు



కారుణ్య నియామకాలు పొందిన వారితో జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలోని కార్యాలయాల్లో కారుణ్య నియామకాల కింద ముగ్గురికి ఉద్యోగాలు కల్పించినట్లు జిల్లా పరిషత్ సీఈఓ సీ నాసరరెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలను అందించారు. పీఎండీ ఇంతియాజ్‌ను నంద్యాల జిల్లా వెలుగోడు మండల పరిషత్ కార్యాలయానికి, ఎం విద్యుల్లతను కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం నేమకల్ జెడ్పీ హైస్కూల్‌కు, ఎస్ రిజ్వానాను నంద్యాల జిల్లా శిరివెళ్ల జెడ్పీ హైస్కూల్‌కు నియమిస్తూ ఉత్తర్వులు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో మిడ్తూరు జెడ్పీటీసీ సభ్యుడు యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

గురుకులాల్లో మిగిలిన సీట్ల భర్తీకి చర్యలు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 10వ తరగతి, సీనియర్ ఇంటర్‌లో మిగిలిన సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 16న ఉదయం 9.30 గంటలకు చిన్నటేకూరులో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులంలో హాజరు కావాలన్నారు. 9వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో వచ్చిన మార్కుల మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు చేపడతామన్నారు. బీఆర్ఏజీసీఈటీ ఎంట్రెన్స్ ఎగ్జామ్ రాసి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులం అరికెరలో సీఈసీ (మిగిలిన సీట్లకు) చదివేందుకు ఆసక్తి కలిగిన జూనియర్ ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ నెల 16న ఉదయం 9.30 గంటలకు చిన్నటేకూరు గురుకులంలోనే స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఆసక్తి, అర్హులైన విద్యార్థులు హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు.


ఎస్సార్బీసీకి నీటి విడుదల

పాణ్యం: గోరుకల్లు జలాశయం నుంచి సోమవారం ఎస్సార్బీసీకి నీటిని విడుదల చేశారు. గోరుకల్లు ఓటీ రెగ్యులేటర్ వద్ద పూజలు చేసిన ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి స్విచ్ ఆన్ చేసి గేట్లును తెరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు నీటిని వృథా చేయకుండా వినియోగించుకోవాలన్నారు. ప్రస్తుతం 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. గోరుకల్లులో 3 టీఎంసీలు ఉండగా వాటిని ఎస్సార్బీసీ ఆయకట్టు రైతులకు ఇబ్బంది లేకుండా నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సుభకుమార్, కడా ఈఈ కృష్ణన్న, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

'పంటల బీమా'కు నేడు తుది గడువు

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పత్తి, వేరుశనగకు ఉద్దేశించిన వాతావరణ ఆధారిత పంటల బీమా కోసం ప్రీమియం చెల్లింపు గడువు ఈ నెల 15వ తేదీతో ముగియనుంది. బీమా చేసుకోవడానికి కేవలం ఒక్క రోజు మాత్రమే అవకాశం ఉంది. పత్తికి హెక్టారుకు రూ.లక్ష విలువకు బీమా చేస్తారు. ప్రీమియం హెక్టారుకు రూ.5000 చెల్లించాల్సి ఉంది. వేరుశనగ హెక్టారుకు రూ.70 వేల విలువకు బీమా చేస్తారు. రైతులు ప్రీమియం రూ.1400 చెల్లించాల్సి ఉంది.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్(పీజీఆర్ఎస్)కు వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కారం చూపాలని, లేదంటే చర్యలు తప్పవని అధికారులను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం పీజీఆర్ఎస్‌లో భాగంగా ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కారాలపై కింది స్థాయి సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. లాగిన్‌లో వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. సీఎంఓ గ్రీవెన్స్‌కు సంబంధించి పెండింగ్‌ల ఉన్న అర్జీలను నిర్దేశిత సమయంలోపు పరిష్కరించాలన్నారు. డీఆర్వో సీ.వెంకటనారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వర్లు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

'ఆట' మొదలైంది.. ఆక్రమణకు తెరలేచింది!

ప్రభుత్వ క్వార్టర్లపై కూటమి నేతల కన్ను

- రాజధానిగా ఉన్నపుడు ఏ, బి, సీ క్యాంపుల్లో క్వార్టర్లు నిర్మాణం
- స్టేడియం నిర్మాణం పేరిట 39 క్వార్టర్ల కూల్చివేతకు నోటీసులు
- లీజు పేరుతో స్థలాన్ని కాజేసేందుకు ప్రజాప్రతినిధుల కుట్ర
- బి, సీ క్యాంపులో సెంటు స్థలం రూ.25లక్షల నుంచి రూ.30లక్షల పైనే
- ఈ లెక్కన 1,090 క్వార్టర్ల విలువ రూ.వేల కోట్లు
- మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే చరిత దంపతుల కనుసన్నల్లో కూల్చివేతలు
- 2 ఎకరాల్లో టీడీపీ కార్యాలయ నిర్మాణానికి కలెక్టర్‌కు టీడీపీ లేఖ
- ఈ స్థలం విలువ రూ.120కోట్లు

ఇదో భారీ 'గూడు' పుఠాణి. కర్నూలు నడిబొడ్డున వేలకోట్ల విలువైన వందల ఎకరాల స్థలాన్ని అభివృద్ధి ముసుగులో కొన్ని నిర్మాణాలు చేపట్టి తక్కిన స్థలాన్ని లీజు పేరుతో ఆక్రమించేందుకు ఇద్దరు ప్రజాప్రతినిధులు కుట్రకు తెరతీశారు. ఈ క్రమంలో తొలి పావు కదిలింది. మినీ క్రికెట్ స్టేడియం పేరుతో 1,090 క్వార్టర్లలో 39 క్వార్టర్ల కూల్చివేతకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. ఆ తర్వాత తక్కిన వాటిని కూల్చనున్నారు. ఈ స్థలంలో కొంత ప్రభుత్వ అవసరాలకు వినియోగించి, ఆ ముసుగులో లీజు పేరుతో టీడీపీ నేతలు, ప్రధాన అనచరులు మిగిలిన స్థలం పాగా వేసేందుకు రంగం సిద్ధమవుతోంది. నగరవాసులు, విపక్ష పార్టీలు మేల్కొనకపోతే విలువైన స్థలం లీజు పేరిట నేతల వశం కానుంది. – సాక్షి ప్రతినిధి కర్నూలు



తమిళనాడు నుంచి విడిపోయిన ఆంధ్ర రాష్ట్రానికి కర్నూలు రాజధానిగా ఉండేది. 1953 అక్టోబర్ 1 నుంచి 1956 అక్టోబర్ 31 వరకూ కర్నూలే రాజధాని. అప్పట్లో అధికారులు నివాసం ఉండేందుకు ఏ, బీ, సీ క్వార్టర్లను ప్రభుత్వం నిర్మించింది. బి, సి క్యాంపు పరిధిలో 1,090 ప్రభుత్వ నివాస సముదాయాలు ఉన్నాయి. ఈ రెండూ కర్నూలుతో పాటు పాణ్యం నియోజకవర్గ పరిధిలోకి వస్తాయి. వీటిలో సింహభాగం ఉద్యోగులు కాకుండా ఇతరులు అక్రమంగా నివాసం ఉంటున్నారు. సిటీ నడిబొడ్డున అత్యంత విలువైన ఈ ప్రాంతంలో 70 ఏళ్ల కిందటి భవనాలు శిథిలావస్థకు చేరాయి. వీటిని తొలగించి ఈ స్థలాన్ని ప్రభుత్వం వినియోగించుకోవాలని.. అపార్ట్‌మెంట్లు నిర్మించి పేదలకు ఇవ్వాలని వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆలోచించారు. వైఎస్ మృతితో ఆ ప్రతిపాదన పట్టాలెక్కలేదు.

సర్కారు స్థలంపై ఇద్దరు నేతల కన్ను

బీ, సీ క్యాంపులోని క్వార్టర్లపై మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే గౌరు చరిత వర్గీయులు కన్నేసినట్లు తెలుస్తోంది. అభివృద్ధి పేరుతో 1,090 క్వార్టర్లను తొలగించి ఇక్కడ మినీ క్రికెట్ స్టేడియం నిర్మించాలని భరత్ భావించినట్లు తెలుస్తోంది. తక్కిన స్థలాలను లీజు పేరుతో కూటమి నేతలు కాజేసే కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం పేరుతో 33 ఏళ్లు లీజుకు తీసుకుని అందులో మల్టీప్లెక్స్, స్టార్ హోటల్స్, ఫంక్షన్‌హాల్స్, షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు ఇతర నిర్మాణాలు చేపట్టాలని భావిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే తొలుత 39 క్వార్టర్ల కూల్చివేతకు ఆర్‌అండ్‌బీ అధికారులు భవనాల్లో నివాసం ఉంటున్నవారికి నోటీసులు ఇచ్చారు. ఈ స్థలం పాణ్యం నియోజకవర్గ పరిధిలోకి కూడా రావడంతో తమకు తెలీకుండా ప్రతిపాదనలు రూపొందించడం, లీజు పేరుతో స్థలాలు కాజేస్తున్నట్లు తెలియడంతో ఎమ్మెల్యే గౌరు చరిత దంపతులు కూడా ఈ వ్యవహారంలో జోక్యం చేసుకున్నట్లు తెలుస్తోంది. తొలివిడతలో 39 క్వార్టర్లు తొలగించిన స్థలంలో స్టేడియం నిర్మాణం పోనూ, మరింత స్థలం మిగులుతుందని, మొత్తం 1090 క్వార్టర్లు తొలగిస్తే వందల ఎకరాల స్థలం ఉంటుందని భావించారు. దీంతో వారు కూడా లీజు పేరుతో స్థలం తీసుకోవాలని భావించినట్లు సమాచారం.



కర్నూలు సీక్యాంప్‌లోని ప్రభుత్వ ఉద్యోగుల క్వార్టర్లు

రూ. వేలకోట్ల విలువైన స్థలం కాజేసేందుకు కుట్ర

బీ, సీ క్యాంపు పరిధిలోని 1,090 క్వార్టర్లు, ఖాళీ ప్రదేశాలు మొత్తం ప్రభుత్వ ఆస్తులే. ఇందులో ఈ స్థలాలను ఆక్రమించి కొందరు ప్రైవేటు నిర్మాణాలు కూడా చేపట్టారు. ఇక్కడ సెంటు స్థలం రూ.25లక్షల నుంచి 30లక్షల వరకూ ఉంది. కొన్ని చోట్ల రూ.50లక్షలు కూడా పలుకుతోంది. ఈ లెక్కన మొత్తం భవనాలు తొలగిస్తే ఆ ప్రదేశం కర్నూలు సిటీలో అత్యంత విలువైన స్థలం అవుతుంది. అప్పుడు దీని విలువ వేల కోట్లు ఉంటుంది. ఓ పథకం ప్రకారం అభివృద్ధి పేరుతో తొలివిడతలో ఓ మినీ క్రికెట్ స్టేడియం, మలి విడతలో ఇంకొన్ని నిర్మాణాలు ప్రజాప్రతినిధులు చేపడతారు. అయినప్పటికీ భారీగా స్థలం మిగిలే ఉంటుంది. ఈ స్థలాన్ని లీజు పేరుతో కొట్టేయాలని పథకం రచించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే నగరంలోని కొందరు బడానేతలు లీజు పేరుతో ప్రభుత్వ స్థలాలను తీసుకుని శాశ్వత నిర్మాణాలు చేపట్టి లీజు ముగిసినా రాజకీయ, ఆర్థిక బలంతో లీజు పొడిగిస్తూ ఆర్థికంగా ఎలా అర్జిస్తున్నారో అందరికీ తెలిసిందే. ఇదే క్రమంలో ఇప్పుడు బీ, సీ క్యాంపు నిర్మాణాలపై కూడా టీడీపీ నేతలు కన్నేశారు. ఈ క్వార్టర్లు కూల్చేసి నిర్మాణాలు చేపడితే కర్నూలులోనే అత్యంత విలువైన ప్రాంతంగా మారుతుంది. ఇలాంటి స్థలాన్ని లీజు పేరుతో చిల్లర ప్రభుత్వ ఖజానాకు విదిల్చి కోట్ల రూపాయలు కొల్లగొట్టేందుకు టీడీపీ నేతలు పథకం రచించారు.

రూ.120కోట్ల విలువైన స్థలంలో టీడీపీ కార్యాలయం

తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయం నిర్మాణానికి 2 ఎకరాలను 99 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి కలెక్టర్ రంజిత్‌బాషాకు లేఖకు రాశారు. బీక్యాంపు మెయిన్‌రోడ్డులోని స్థలం టీడీపీ కోరింది. ఇక్కడ సెంటు రూ.60లక్షలు ఉంది. ఈ లెక్కన 2 ఎకరాల విలువ రూ.120కోట్లు పైనే. కొన్ని పార్టీలు 33 ఏళ్లకు ప్రభుత్వ స్థలాలు లీజుకు తీసుకుంటే టీడీపీ నేతలు నానా యాగీ చేశారు. ఇప్పుడు టీడీపీ ఆఫీసుకు విలువైన స్థలాన్ని 99 ఏళ్లపాటు లీజు కోసం కలెక్టర్‌కు లేఖ రాశారు. టీడీపీ ఆఫీసు ప్రతిపాదన తర్వాతే ఈ స్థలంలోని క్వార్టర్లను కూల్చేసి అభివృద్ధి కార్యాక్రమాల పేరుతో కొన్ని నిర్మాణాలు చేపట్టి స్థలాలను లీజుకు తీసుకోవచ్చనే ఆలోచన కూటమి నేతలు చేసినట్లు తెలుస్తోంది.



కర్నూలు బీక్యాంప్‌లోని ప్రభుత్వ క్వార్టర్లలో స్టేడియం నిర్మాణం కోసం విడుదలైన జీఓ

కోడుమూరు మహిళా మార్ట్ మూత

కర్నూలు(అగ్రికల్చర్)/కోడుమూరు రూరల్: కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం, డీఆర్‌డీఏ ఏపీఎం, సీసీల అవినీతి కారణంగా కోడుమూరులోని చేయూత మహిళా మార్ట్ మూతపడింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఒక వెలుగు వెలిగిన ఈ మహిళా మార్ట్‌ను నేడు చీకటి కమ్మేసింది. ఈ నెల 11న సాక్షిలో 'మూత దిశగా మహిళా మార్ట్' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఊహించినట్లుగానే మార్ట్ మూతపడటం పొదుపు మహిళలకు తీరని ఆవేదనను మిగిల్చింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2021–22లో కోడుమూరులో పైలెట్ ప్రాజెక్టుగా మహిళా మార్ట్ ఏర్పాటైంది. కార్పొరేట్ తరహాలో మార్ట్ పొదుపు మహిళలతో పాటు ఇతర అన్ని వర్గాల వినియోగదారులను ఆకట్టుకుంది. 2024 మే నెలలో జరిగిన ఎన్నికల వరకు లాభాల బాటలో నడచిన మార్ట్ కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత మార్ట్‌ను పర్యవేక్షిస్తూ గుప్పిట్లో పెట్టుకున్న అప్పటి ఏపీఎం, సీసీలు పథకం ప్రకారం నిధులను కొల్లగొట్టారు. చివరికి మూతపడటానికి కారణమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే అధికారులు మాత్రం మార్ట్ మేనేజర్, మార్ట్ కమిటీ ప్రెసిడెంట్, మార్ట్ కమిటీ సభ్యురాలిని మాత్రమే బాధ్యులను చేసి సిబ్బందిని కాపాడినట్లు చర్చ జరుగుతోంది.



పాఠశాలల్లో మరుగుదొడ్ల వివరాలు పంపాలి

- పాఠశాల విద్య కమిషనర్

సాక్షి ఎఫెక్ట్

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, జెడ్పీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా అవసరం కానున్న మరుగుదొడ్ల వివరాలు పంపాలని పాఠశాల విద్య కమిషనర్ నుంచి సోమవారం ఎంఈఓలకు ఆదేశాలు వచ్చాయి. ఎమ్మిగనూరు పట్టణంలోని ఎంఎస్ బాలికల జెడ్పీ పాఠశాలలో 3,630 మంది విద్యార్థినులు మరుగుదొడ్లు లేక పడుతున్న అవస్థలపై సాక్షిలో 'ఆ అవసరానికీ అవస్థే...!' అని ఈనెల 8న ప్రచురితమైన వార్తకు పాఠశాల విద్య కమిషనర్ స్పందించారు. ప్రస్తుతం పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మరుగుదొడ్ల వివరాలు సత్వరం పంపాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఎంఈఓలు సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు మరుగుదొడ్ల జాబితాలు తయారు చేస్తున్నారు.

'కూటమి'కి పతనం తప్పదు

- వెంటనే స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి
- విద్యుత్ భవన్‌ను ముట్టడించిన సీపీఎం నేతలు, కార్యకర్తలు



విద్యుత్‌భవన్ దగ్గర ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(అగ్రికల్చర్): స్మార్ట్ మీటర్లు రద్దు చేయకపోతే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి పతనం తప్పదని సీపీఎం నాయకులు హెచ్చరించారు. స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకిస్తూ మరో ఉద్యమం చేస్తామన్నారు. కర్నూలులోని విద్యుత్ భవన్‌ను సోమవారం సీపీఎం నాయకులు ముట్టడించారు. కర్నూలు కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల దగ్గర ఉన్న పవర్‌హౌస్‌లో కూడా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ.. స్మార్ట్‌మీటర్లు బిగించడం అంటే ప్రజలను విద్యుత్ బిల్లుల పేరుతో దోపిడీ చేయడమేనన్నారు. ఎన్నికల సమయంలో స్మార్ట్‌మీటర్లను చంద్రబాబు, లోకేష్‌లు తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి సర్దుబాటు పేరుతో చార్జీలు పెంచుతూ ప్రజల నడ్డివిరుస్తున్నారన్నారు. సంవత్సర కాలంలో ప్రజలపై రూ.20వేల కోట్ల భారం వేశారన్నారు. ఆందోళన చేపట్టిన సీపీఎం నాయకుల దగ్గరకు వచ్చి విద్యుత్ శాఖ ఈఈ ఓబులేసు వినతిపత్రం స్వీకరించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు నిర్మల, కర్నూలు నగర కార్యదర్శి రాముడు, జిల్లా నాయకులు అలివేలమ్మ, నగేష్, గురుశేఖర్, నరసింహులు, సుధాకరప్ప, సాయిబాబా, షరీఫ్, అబ్దుల్లా , రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీలో 'పారా' పరీక్షలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో వివిధ కళాశాలల విద్యార్థులకు డిప్లొమా పారామెడికల్ వార్షిక పరీక్షలు నిర్వహించారు. జిల్లాలోని 8 కళాశాలల నుంచి 570 మంది విద్యార్థులు 15 కోర్సులకు సంబంధించి ఇక్కడ పరీక్షలు రాస్తున్నారు. ఇందుకోసం కళాశాలలో నాలుగు చోట్ల పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. సోమవారంతో పాటు మంగళ, బుధవారాల్లో నిర్వహించే ఈ పరీక్షలకు చీఫ్ కో ఆర్డినేటర్‌గా పెథాలజీ హెచ్ఓడీ డాక్టర్ జి.బాలీశ్వరి, అబ్జర్వర్‌గా డాక్టర్ ఎస్.సింధియా శుభప్రద వ్యవహరిస్తున్నారు.

లెక్చరర్ పోస్టుల భర్తీకి నేటి నుంచి పరీక్షలు

కర్నూలు(సెంట్రల్): పాలిటెక్నిక్, జూనియర్, డిగ్రీ కాలేజీ లెక్చరర్ పోస్టుల భర్తీకి 15 నుంచి 21వ తేదీ వరకు ఆన్‌లైన్ బేస్డ్ ఆబ్జెక్టివ్ పరీక్షలను నిర్వహించేందుకు ఏపీపీఎస్సీ ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాలో మొత్తం ఆరు కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు, మధ్యాహ్నం 2.30 గంటలనుంచి సాయంత్రం 5 గంటలకు పరీక్షలు నిర్వహిస్తారు. జిల్లాలోని ఆదోని బీమాస్, ఎమ్మిగనూరు సెయింట్ జాన్స్, కర్నూలులోని జి.పుల్లారెడ్డి, జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీలు, కర్నూలులోని సనత్‌నగర్ అయాన్ డిజిటల్, దూపాడు అయన్ డిజిటల్ పరీక్షా కేంద్రాల్లో ప్రతిరోజూ పరీక్షలు జరుగుతాయి. ఏపీపీఎస్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కోఆర్డినేటర్/డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ అధికారులను ఆదేశించారు.

మద్యం మత్తులో విధులకు హాజరు

- హొళగుంద జూనియర్ కళాశాలలో ఘటన

హొళగుంద: రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసు అనే ఉద్యోగి మద్యం మత్తులో విధులకు హాజరయ్యారు. తమ పట్ల రికార్డు అసిస్టెంట్ దురుసుగా ప్రవర్తించాడని సోమవారం విద్యార్థుల తండ్రులు ఆందోళనకు దిగారు. ఈ ఘటన సోమవారం హొళగుంద జూనియర్ కళాశాలలో చోటు చేసుకుంది. తల్లికి వందనం, ఎస్ఎస్ఎంఎస్ స్కీంకు సంబంధించి డబ్బులు పిల్లల ఖాతాలో ఎందుకు జమ కాలేదని అడగ్గా.. అక్కడ విధులు నిర్వహిస్తున్న రికార్డు అసిస్టెంట్ శ్రీనివాసులు మద్యం మత్తులో ఉండి నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. రికార్డు అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రవీణకు విద్యార్థుల తల్లిదండ్రులు వినతిపత్రం అందజేశారు.



మద్యం మత్తులో ఉన్న రికార్డు అసిస్టెంట్‌తో మాట్లాడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

అంతర్రాష్ట్ర బైకు దొంగల అరెస్టు





వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాబు ప్రసాద్, దొంగల నుంచి పోలీసులు రికవరీ చేసిన బైకులు


- 24 ద్విచక్ర వాహనాలు రికవరీ

కర్నూలు: వివిధ చోట్ల బైకులను చోరీ చేసి తప్పించుకు తిరుగుతున్న ముగ్గురు అంతర్‌రాష్ట్ర దొంగలను మూడో పట్టణ పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. ఈ ఏడాది మే 22వ తేదీన కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో ఓ ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూన్ 18న మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టగా దొంగల చిట్టా బయటపడింది. సీసీ ఫుటేజీ, సాంకేతిక ఆధారంగా నిందితులు అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం బురుజుపల్లి గ్రామానికి షేక్ బాబా ఫక్రుద్దీన్, పెద్దమండెం మండలం గుడిసెల చెరువు గ్రామానికి చెందిన షేక్ దాదా పీరా, కడప పట్టణానికి చెందిన చౌడగండ్ల అనీస్ అని తేలింది. వీరిని కర్నూలులోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని ఓ టైల్స్ ఫ్యాక్టరీ వెనకాల ఉన్న కంప చెట్ల వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 24 బైకులను రికవరీ చేసి కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ ఎదుట హాజరుపర్చారు. సీఐలు శేషయ్య, నాగశేఖర్, ఎస్ఐ చంద్ర తదితరులతో విలేకరుల సమావేశం నిర్వహించి డీఎస్పీ బాబు ప్రసాద్ వివరాలను వెల్లడించారు. షేక్ బాబా ఫక్రుద్దిన్, షేక్ దాదా పీరా, అనీస్ తదితరులు కలసి జట్టుగా ఏర్పడి బైకులు చోరీ చేసి కర్నూలులో దాచిపెట్టి నంద్యాల పట్టణానికి చెందిన సుభాన్, షాపీరాల ద్వారా విక్రయించి సొమ్ము చేసుకునేవారు. ఎలక్ట్రానిక్ పరికరాలతో నకిలీ ఆర్‌సీ (డూప్లికేట్)లను తయారు చేసి వాటిని ఒరిజినల్‌గా చూపి గ్రామీణ ప్రాంతాల్లో విక్రయించేవారు. నంద్యాలకు చెందిన సుభాష్, షాపీరాలు ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలో అరెస్టు చేయనున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.

పది పీఏసీఎస్‌లకు పాలకవర్గాల నియామకం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 10 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ముగ్గురు సభ్యుల పాలకమండళ్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు జిల్లాలో 5, నంద్యాల జిల్లాలో 5 సంఘాలకు పాలకవర్గాలు ఏర్పాటయ్యాయి. చైర్మన్‌గా ఒకరు, సభ్యులుగా ఇద్దరు నియమితులయ్యారు. కర్నూలు జిల్లాలో కడిమెట్ల సొసైటీ చైర్మన్‌గా విరుపాక్షి రెడ్డి, మదిర (దామోదర్ చౌదరి), పెద్ద తుంబలం (అన్వర్ బాషా), పెద్ద హరివణం (ఆదిశేషారెడ్డి), గోనెగండ్ల (ఎస్‌వీ రామాంజనేయులు), నంద్యాల జిల్లాలోని కానాల సొసైటీ చైర్మన్‌గా ప్రేమనాథ్ రెడ్డి, పోలూరు (చంద్రమౌలీశ్వర్ రెడ్డి), గడివేముల (సత్యనారాయణ రెడ్డి), గోస్పాడు (వీరసింహా రెడ్డి), దీబగుంట్ల సొసైటీ చైర్మన్‌గా ఓబుల్ రెడ్డి నియమితులయ్యారు.

ఏపీఎల్‌కు ఆలూరుకు కుర్రాడు



కమరుద్దీన్

ఆలూరు రూరల్: ఆంధ్రా ప్రీమియర్ క్రికెట్ లీగ్ (ఏపీఎల్)కు ఆలూరుకు కుర్రాడు కమరుద్దీన్ ఎంపికయ్యాడు. సోమవారం వైజాగ్‌లో నిర్వహించిన ఏపీఎల్ వేలాల్లో కాకినాడ కింగ్స్ టీం కమరుద్దీన్‌ను రూ.5.20 లక్షలకు కొనుగోలు చేసింది. 2023 ఏడాది సెప్టెంబర్ నెలలో విశాఖపట్నంలో జరిగిన ఏపీల్‌లో టోర్నీ ఫైనల్‌లో 13 వికెట్లు తీసి..185 బంతుల్లో 38 పరుగులు చేసి ఆల్‌రౌండర్ ప్రతిభ చాటి పర్పూల్ క్యాప్ సొంతం చేసుకున్నాడు. క్రికెట్‌పై ఆసక్తితో 13 ఏళ్ల నుంచే శ్రమించాడు. 20 ఏళ్ల వయసులో ఆంధ్ర, సౌత్‌జోన్ జట్టులో చోటు సంపాదించాడు. అప్పట్లోనే ఆల్‌రౌండర్‌గా పేరు తెచ్చుకున్నాడు. కుటుంబ సభ్యుల సహకారంతో మరో సారి ఏపీఎల్‌కు ఎన్నికయ్యానని, దేశం కోసం ఆడాదలన్నదే తన ఆశయమని కమరుద్దీన్ తెలిపారు.

కాల్వబుగ్గ హుండీ ఆదాయం రూ.2.96 లక్షలు

ఓర్వకల్లు: కాల్వబుగ్గ రామేశ్వర స్వామి దేవస్థానానికి రూ. 2.96 లక్షల హుండీ ఆదాయం వచ్చింది. సోమవారం దేవదాయ శాఖ ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ పర్యవేక్షణలో ఈఓ మద్దిలేటి, ఆలయ చైర్మన్ కాటినేని నారాయణ ఆధ్వర్యంలో హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. మూడు నెలలకు సంబంధించి భక్తులు కానుకలుగా రూ.2,81,743, అన్నదాన హుండీలో రూ.14,760 కలిపి మొత్తం రూ.2,96,503 ఆదాయం లభించింది. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ.. ఆలయ ప్రధాన గర్భగుడిలో నాలుగు రోజుల క్రితం హుండీలు చోరీకి గురికావడంతో, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసుల సమక్షంలో హుండీ లెక్కింపు కార్యక్రమం చేపట్టినట్లు మద్దిలేటి పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలాజీ సేవా సమితి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

20 రోజులకోసారి మంచినీరు!



అరికెర గ్రామంలో కుళాయి వద్ద తాగునీటి కోసం తోపుడు బండ్లతో వచ్చిన గ్రామస్తులు

ఆలూరు రూరల్: జిల్లా పశ్చిమ ప్రాంతమైన ఆలూరు నియోజకవర్గంలో తాగునీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రాలకు 15 రోజులకు ఒక సారి మంచి నీరు సరఫరా అవుతోంది. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు 20 రోజులకోసారి మంచినీరు ఇస్తున్నారు. ఆలూరు మండలంలోని అరికెర గ్రామానికి 18 రోజుల తర్వాత సోమవారం మంచినీరు వదిలారు. గ్రామంలో ఇంటింటి కుళాయిలు లేవు. గ్రామస్తులు తోపుడు బండ్ల సహాయంతో పబ్లిక్ కుళాయిల వద్దకు వెళ్లి మంచినీరు తెచ్చుకున్నారు. హాలహర్వి మండలం విరుపాపురం రిజర్వాయర్ నుంచి అరికెర గ్రామానికి తాగునీరు సరఫరా అవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సకాలంలో మంచినీరు సరఫరా చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

అభిషేకం చేయిస్తానని డబ్బులు వసూలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మల్లికార్జున స్వామికి అభిషేకం చేయిస్తానని భక్తులను మోసం చేసిన వ్యక్తిని ఆలయ ఏఈవో హరిదాసు పట్టుకున్నారు. సోమవారం శ్రీశైలంకు చెందిన పవన్ అనే వ్యక్తి ఆరుగురు భక్తులను మల్లికార్జున స్వామివారికి అభిషేకం చేయిస్తానని వారి వద్ద నుంచి రూ.15వేలు తీసుకున్నట్లు సమాచారం. సదరు వ్యక్తి రూ.300 టికెట్లను ఒక్కొరికి రెండు చొప్పున ఆరు తీసుకుని దర్శనానికి వెళ్లాడు. అక్కడ భక్తులను విచారించగా తమ వద్ద రూ.15 వేలు డబ్బులు తీసుకున్నట్లు వారు ఏఈవో దృష్టికి తీసుకువచ్చారు. దీంతో పవన్‌ను సీఎస్‌వోకి అప్పగించారు. ఆయన విచారించి శ్రీశైలం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తిరుమలకు ప్రత్యేక ప్యాకేజీ

కర్నూలు కల్చరల్: ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) ఆధ్వర్యంలో తిరుమలకు ప్రత్యేక ప్యాకేజీ టూర్ ఏర్పాటు చేసినట్లు ఏపీటీడీసీ డీవీఎమ్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. వారంలో రెండు రోజులు ఏపీటీడీసీ తిరుమలకు ప్యాకేజీతో బుస్ బయలు దేరుతుందని తెలిపారు. ప్రతి మంగళవారం, శుక్రవారం కర్నూలు నుంచి నంద్యాల మీదుగా తిరుమలకు ట్విన్ షేరింగ్ నాన్ -ఏసీ బస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కర్నూలు నుంచి తిరుమలకు రూ. 2,670, నంద్యాల నుంచి తిరుమలకు రూ.2,470 ప్యాకేజీ ఛార్జీ ఉంటుందని పేర్కొన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలకు పూర్తిగా ఉచితమన్నారు. తిరుమలలో స్పెషల్ ఎంట్రీ దర్శనం, శ్రీకాళహస్తి, శ్రీనివాస మంగాపురం, తిరుచానూరు క్షేత్రాలు ప్యాకేజీలో ఉన్నాయని తెలిపారు. కర్నూలు వెంకట రమణ కాలనీలోని ఏపీటీడీసీ కార్యాలయం నుంచి బస్సు బయలు దేరుతుందని తెలిపారు. కొత్త బస్టాండ్, మెడికల్ కళాశాల సమీపం, నంద్యాల చెక్‌పోస్ట్ ప్రాంతాల్లో పికప్ పాయింట్లు ఉన్నాయని పేర్కొన్నారు. వివరాలకు ఏపీటీడీసీ కార్యాలయాన్ని సందర్శించాలన్నారు.

ఒక్క క్వింటా కూడా కొనలేదు



కంపెనీలను నమ్ముకొని ఆరు ఎకరాల్లో పొగాకు సాగు చేశాం. ఎకరాకు రూ. 75,000 ప్రకారం పెట్టుబడి పెట్టాం. మొత్తంగా 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇప్పటి వరకు ఒక క్వింటా కూడా కొనలేదు. నిల్వ చేయడంతో నాణ్యత కోల్పోయే ప్రమాదం ఉంది. పొగాకు సాగు చేసి కోలుకోలేని విధంగా నష్టపోయాం. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని పొగాకు రైతులకు న్యాయం చేయాలి.
– శ్రీనివాసులు, పడిదెంపాడు, కర్నూలు మండలం

300 బేళ్ల పొగాకు మిగిలిపోయింది



గతేడాది 50 ఎకరాల్లో చుక్క బర్లీ పొగాకు సాగు చేశాం. కౌలుతో సహా ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాం. అలయన్స్ కంపెనీతో ఒప్పందం ఉంది. ఇది వరకు 150 క్వింటాళ్ల పొగాకు విక్రయించాం. ఇప్పటికీ మా దగ్గర 300 బేళ్ల(దాదాపు 250 క్వింటాళ్లు) పొగాకు ఉంది. దీని విలువ రూ.38.75 లక్షలు ఉంది. కంపెనీ చుట్టూ, అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఈ సారి పొగాకు వదిలి మొక్కజొన్న సాగు చేస్తున్నాం.– మద్దిలేటి, కరివేన, ఆత్మకూరు మండలం



ఇంటింటా బేళ్ల చూపులు

- రైతుల ఇళ్ల నుంచి కదలని పొగాకు
- ఒప్పందాన్ని అమలు చేయని కంపెనీలు
- స్పందించని రాష్ట్ర ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 40,950 క్వింటాళ్లకుపైగా మిగిలిపోయిన పొగాకు
- నిల్వలను చూసి గుండెపోటుకు గురవుతున్న రైతులు

కర్నూలు(అగ్రికల్చర్): రెక్కల కష్టాన్ని నమ్ముకున్న రైతులకు పెద్ద కష్టం వచ్చింది. ఇంటి నిండా పొగాకు బేళ్లు ఉన్నా కొనేవారు లేరు. పంట సాగుకు ముందు ఒప్పందం చేసుకున్న కంపెనీలు మౌనం వహిస్తున్నాయి. రైతులకు అండగా ఉండాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. నష్టాన్ని భరించలేక కొందరు రైతులు గుండెపోటుతో హఠాన్మరణానికి పాల్పడుతున్నారు. ఇంటింటా 'బేళ్ల' చూపులు కనిపిస్తున్నా పాలకులు స్పందించడం లేదు. కర్షకుడి గుండెకు ధైర్యాన్ని ఇవ్వాలనే విషయాన్నే మరచిపోయారు.

కొను'గోల్‌మాల్'

గతేడాది కర్నూలు జిల్లాలో 36,471, నంద్యాల జిల్లాలో 30,865.. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 67,336 ఎకరాల్లో పొగాకు సాగు చేశారు. పంట చేతికి వచ్చి 10 నెలలు అవుతోంది. బోర్డు అధికారులు గిట్టుబాటు ధర ఇవ్వకపోవడం, అన్ని గ్రేడ్‌ల పొగాకు బేళ్లను కొనుగోలు చేయక పోవడంతో రైతుల ఇళ్లల్లో గుట్టలుగా ఉన్నాయి. గతేడాదికి సంబంధించి పొగాకు కంపెనీల అసోసియేషన్ క్వింటాకు రూ.15,500 ధర నిర్ణయించింది. అయితే పొగాకు కంపెనీలు గరిష్టంగా రూ.8,000 మాత్రమే ధర ఇస్తున్నాయి. దీంతో రైతులు నష్టాలు మూట కట్టుకుంటున్నారు. కొనుగోళ్ల ప్రక్రియ మార్చిలోపే పూర్తి కావాల్సి ఉన్నా ఇప్పటికీ పొగాకు నిల్వలు రైతుల ఇళ్లల్లో ఉండిపోయాయి.

స్పందించని రాష్ట్ర ప్రభుత్వం

పొగాకు సాగు చేసి నష్టాలు మూట కట్టుకుంటున్న రైతులకు చేయూత ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసింది. కంపెనీలతో, ప్రభుత్వరంగ సంస్థ అయిన మార్క్‌ఫెడ్, నాఫెడ్‌ల ద్వారా మద్దతు ధరతో పొగాకును కొనే ఏర్పాటు చేయాల్సి ఉంది. కాని ఇవేమీ పట్టించుకోకుండా మిన్నకుండి పోవడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. కంపెనీల ఒప్పందంతో రైతులు పొగాకు సాగు చేసినా అవి కొనుగోలు చేయడం లేదు.కంపెనీల మెడలు వంచి కొనిపించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్నా స్పందించడం లేదు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ మొదలై దాదాపు రెండు నెలలవుతున్నా గతేడాది పండించిన పంటనే అమ్ముకోలేని దుస్థితి ఏర్పడింది.

పొగాకు సాగు వద్దు బాబోయ్..

పొగాకు రైతులు ఇబ్బంది పడుతున్నా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ముగ్గురు మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదు. పొగాకు దిగుబడిని అమ్ముకోలేకపోవడం, నష్టాలు రావడంతో ఇటీవల నంద్యాల జిల్లా బండిఆత్మకూరు మండలం ఎర్రగుంట్ల గ్రామంలో రైతు బొబ్బిలి రమణ రెడ్డి గుండెపోటుతో మృతి చెందాడు. అయినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈ ఏడాది పొగాకు సాగుకు రైతులు ఉత్సాహం చూపడం లేదు. ఇప్పటికే ఐటీసీ కంపెనీ అగ్రిమెంటు చేసుకునేందుకు ముందుకు వచ్చినా రైతుల నుంచి స్పందన లేదు. మిగిలిన కంపెనీల జాడ లేకుండా పోయింది. గతేడాది పొగాకు సాగు చేసిన రైతులు ప్రస్తుతం పత్తి, మొక్కజొన్న తదితర పంటల వైపు వెళ్లారు.

రైతులంటే ఇంత చులకనా?



అమ్మకానికి పొగాకు బేళ్లను తీసుకొచ్చిన రైతులు

ఆదోని టౌన్: ' రేయింబవళ్లు కష్టపడి పంటలు పండిస్తే కనీసం ధర ఇవ్వరా? రాష్ట్ర ప్రభుత్వానికి, పొగాకు కంపెనీలకు రైతులంటే ఇంత చులకనా' అంటూ కర్షకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్వింటాకు రూ.18,500 ఇస్తామని చెప్పి అతి తక్కువకు కొనుగోలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఆదోని మండలం ధణాపురం గ్రామంలో సోమవారం ఓ కంపెనీ పొగాకును కొనుగోలు చేశారు. పొగాకు నాణ్యత లేదని, రంగు మారిందని, నల్లబడిందని చెబుతూ క్వింటా రూ. 4,000 నుంచి రూ.3,500 మొదలుకొని రూ.6 వేలకు మించకుండా కొనుగోలు చేయడంతో రైతులు మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం, కర్నూలు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలతో పొగాకును తీసుకెళ్లిన రైతులు గిట్టుబాటు ధర రాకపోవడంతో నిరుత్సాహం చెందారు. ఇష్టానుసారంగా ధరలు తగ్గించి పొగాకు రైతులను నట్టేట ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇవీ పొగాకు నిల్వలు (క్వింటాళ్లలో)

జిల్లా	నిల్వ
కర్నూలు	14,500
నంద్యాల	26,450
మొత్తం	40,950

రైతుల వద్ద చుక్కబర్లీ, సిరి పొగాకు నిల్వ ఉంది. దీని విలువ రూ.63.48 కోట్లు (క్వింటాకు మద్దతు ధర రూ.15,500 ప్రకారం)ఉంటుంది.

నట్టేట ముంచారు



పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి. ఎకరాకు రూ.లక్ష చొప్పున పెట్టుబడి అయ్యింది. నేడు పలు కంపెనీలు కొనుగోలు చేస్తున్నా తక్కువ ధరతో రైతులు నట్టేట మునిగిపోవాల్సి వచ్చింది. పొగాకు రైతుల గోడును ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.
– శ్రీనివాసులు, రైతు, ఉప్పలపాడు, ఓర్వకల్లు మండలం

చర్యలు తీసుకుంటాం



పొగాకు రైతులందరికీ న్యాయం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. ఇప్పటికే రెండు దఫాలుగా కంపెనీలతో సమావేశాలు నిర్వహించాం. మిగిలిపోయిన పొగాకు అగ్రిమెంట్ చేసుకోలేదని కంపెనీలు చెబుతున్నాయి. పొగాకు రైతులకు న్యాయం చేసేందుకు టొబాకో బోర్డుకు, వ్యవసాయ శాఖ కమిషనర్‌కు లేఖలు రాశాం. త్వరలోనే సమావేశం నిర్వహించి మిగిలిపోయిన పొగాకును కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటాం.
– డాక్టర్ నవ్య, జాయింట్ కలెక్టర్, కర్నూలు

ఆలయ భద్రతా సిబ్బందిని పెంచాలి

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



విలేకర్లతో మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: కాల్వబుగ్గ రామేశ్వర స్వామి ఆలయానికి భద్రతా సిబ్బందిని పెంచి రక్షణ కల్పించాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మూడు రోజుల క్రితం ఆలయంలో చోరీ జరిగిందని తెలుసుకున్న ఆయన సోమవారం దేవస్థానాన్ని సందర్శించారు. ముందుగా స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం చోరీ జరిగిన తీరును ఈఓ మద్దిలేటిని అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాల్లో రికార్డు అయిన చోరీ ఫుటేజీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆలయ అభివృద్ధికి కృషి చేశామన్నారు. ప్రహరీ నిర్మాణం, గదుల మరమ్మతుల నిమిత్తం రూ.5 కోట్లతో టీటీడీ బోర్డుకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఆ వెంటనే సార్వత్రిక ఎన్నికలు రావడంతో ప్రతిపాదనలు నిలిచిపోయాయన్నారు. ఆలయ అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఆలయం జాతీయ రహదారి పక్కన ఉండటంతో ప్రహరీ నిర్మిస్తే ఇలాంటి ఘటనలు పునరావృతం కావన్నారు. కాటసాని వెంట కర్నూలు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, సింగిల్ విండో మాజీ చైర్మన్ నాగతిరుపాలు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు జీకే వెంగన్న, గోపా రమణా రెడ్డి, పాలకొలను రమేష్, కాల్వ, హుసేనాపురం గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం!

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు



ఎస్పీకి సమస్యలు చెప్పుకుంటున్న అర్జీదారులు

కర్నూలు: ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి కర్నూలు వెంకటరమణ కాలనీకి చెందిన రాజశేఖర్ రెడ్డి రూ.3 లక్షలు తీసుకుని మోసం చేశాడని కర్నూలు ఇందిరా గాంధీ నగర్‌కు చెందిన మహేష్ బాబు ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కనున్న క్యాంపు కార్యాలయంలో ఎస్పీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మహేష్ బాబు ఫిర్యాదుపై ఎస్పీ స్పందించి ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులు మోసపోవద్దని, పోటీ పరీక్షల ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు వస్తాయన్నారు. డబ్బులు ఇస్తే ఉద్యోగాలు ఇస్తామని చెప్పే వ్యక్తులను నమ్మి మోసపోవద్దని సూచించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎస్పీ వినతులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు మొత్తం 102 ఫిర్యాదులు వచ్చాయి. వాటన్నిటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా కూడా పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

- ప్రభుత్వ పథకం విద్యాంజలి 2.0లో కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ ఫ్యాకల్టీ, అటెండర్, వంట మనిషి, వాచ్‌మెన్, స్వీపర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి వెల్దుర్తికి చెందిన ప్రశాంత్ బాబు ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష దాకా తీసుకుని మోసం చేశాడని కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన నాగమణి, నారాయణ, అక్బర్, రాజేష్, సుజాత, వెంకటేష్, మద్దిలేటి తదితర బాధితులు ఫిర్యాదు చేశారు.
- లక్ష్మీపురం రోడ్డులో ఉన్న తను ప్లాట్‌ను ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కర్నూలు శ్రీరామ కాలనీకి చెందిన అనితరాణి ఫిర్యాదు చేశారు.
- పశుసంవర్ధక శాఖలో తన ఇద్దరు కుమారులు డాక్టర్‌గా, ఏఈలుగా పనిచేస్తున్నారని, తనకు క్షయ వ్యాధి రావడంతో ఇంటి నుంచి తరిమేసి అన్యాయం చేశారని, విచారణ జరిపి న్యాయం చేయాలని కోడుమూరు మండలం మెరుగుదొడ్డి గ్రామానికి చెందిన హనుమంతు కోరారు.
- కర్నూలు బాలాజీ నగర్‌లోని గ్రామీణ బ్యాంకు దగ్గర ఇంటి గేటు లోపల ఉన్న బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు తస్కరించారని, దర్యాప్తు చేసి బైక్‌ను వెతికించి ఇవ్వాలని యజమాని అన్వర్ ఫిర్యాదు చేశారు.

వానదేవా.. కరుణించు!



ఎగువ పుష్కరఘాట్ ఒడ్డున ఉన్న గంగాదేవికి కృష్ణాజలాలతో అభిషేకం చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: వానదేవా కరుణించు.. అంటూ ఎర్రమఠం గ్రామస్తులు సోమవారం సంగమేశ్వరంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎగువ పుష్కరఘాట్ వద్ద ఉన్న ఉమామహేశ్వరాలయంలో శివలింగానికి, లలితాదేవి, గంగాదేవికి 101 బిందెలతో కృష్ణా జలాలు తెచ్చి జలాభిషేకం చేశారు. ఖరీఫ్ సీజన్‌లో రైతన్నలు సాగుచేసుకున్న మొక్కజొన్న, పత్తి, సోయాబీన్ ఇతర పంటలు వర్షాలులేక ఎండిపోయే దుస్థితి నెలకొంది. దీంతో వానలు కురవాలని ప్రజలు పూజలు చేస్తున్నారు.

వర్షం కోసం కప్పల ఊరేగింపు



కప్పలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

కొలిమిగుండ్ల: వర్షాలు కురవాలని కొలిమిగుండ్లలో సోమవారం గ్రామస్తులు కప్పలతో ఊరేగింపు నిర్వహించారు. పొడవాటి కర్రకు మధ్యలో కప్పలను వేలాడదీశారు. కుండలో పసుపు, కుంకుమ కలిపిన నీళ్లు పోసి డప్పు వాయిద్యాలతో ఊర్లోని పలు వీధుల్లో ఊరేగింపు చేస్తు ఇంటింటి వద్ద ధాన్యం సేకరించారు. సాయంత్రం గంగమ్మకు పూజలు నిర్వహించారు. వర్షాలు కురవక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వానదేవుడు కరుణించాలనే ఉద్దేశంతో పాత కాలపు ఆచారాన్ని చేపట్టామన్నారు. ఈవిధంగా చేయడం వల్ల వర్షాలు కురుస్తాయని నమ్మకంతో చేశామని నిర్వాహకులు తెలిపారు.

కుందూలో పడి మహిళ మృతి



మృతురాలు వెంకటలక్ష్మమ్మ (ఫైల్)

ఉయ్యాలవాడ: ప్రమాదవశాత్తూ ఓ మహిళ కుందూనదిలో పడి మృత్యువాత పడింది. ఉయ్యాలవాడ, రూపనగుడి గ్రామాల మధ్య ఈ ఘటన చోటు చేసుకుంది. సంజామల మండలం కమలపురి గ్రామానికి చెందిన దాసరి వెంకటలక్ష్మమ్మ(57)కు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో కుటుంబీకులు భూత వైద్యం కోసం ఆదివారం రాత్రి ఉయ్యాలవాడలోని ఓ మహిళ దగ్గరకు తీసుకొచ్చారు. ఆ తర్వాత కుమారుడు బాల వెంకటేశ్వర్లు, తల్లి వెంకటలక్ష్మమ్మలు ఓ బైక్‌పై తిరుగుప్రయాణమయ్యారు. మార్గమధ్యలో రూపనగుడి వద్ద కుందూ బ్రిడ్జిపై వెళ్తుండగా వెంకటేశ్వర్లు కంటిలో పురుగు పడింది. ఈ క్రమంలో అతను కళ్లు మూసుకుని నలుపుతుండగా బైక్ ప్రమాదవశాత్తూ నదిలోకి దూసుకెళ్లింది. వెనుక బైక్‌పై వస్తున్న మరో కుమారుడు, కోడలు గమనించి కేకలు వేశారు. నదిలో నీటి ప్రవాహం తక్కువగా ఉండటంతో అటుగా వెళ్తున్న వాహనదారులు వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మమ్మను బయటకు తీశారు. కొన ఊపిరితో వున్న వెంకటలక్ష్మమ్మను 108లో ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. కుందూనదిలో పడిన బైక్‌ను ఉయ్యాలవాడకు చెందిన మత్స్యకారుల సహకారంతో సోమవారం పోలీసులు బయటకు తీశారు.

ఎరువులు, విత్తనాల దుకాణాల్లో తనిఖీలు



ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేపడుతున్న ప్రత్యేక స్క్వాడ్ అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): ఎరువులు, పురుగుమందులు, విత్తనాల అక్రమ నిల్వలు, చట్టాలకు లోబడి అమ్మకాలు జరుగుతున్నాయా అనే దానిపై వ్యవసాయ శాఖ అన్ని జిల్లాల్లో ప్రత్యేక స్క్వాడ్‌లతో తనిఖీలు చేపట్టింది. వ్యవసాయ శాఖ ఇతర జిల్లాల అధికారులు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులతో అన్ని జిల్లాలకు టీమ్‌లు పంపింది. కర్నూలు జిల్లాకు రెండు టీమ్‌లు వచ్చాయి. ఒంగోలు ఏడీఏ రమేష్‌బాబు, విజిలెన్స్ సీఐ నారాయణప్పలతో కూడిన టీమ్ కల్లూరు మండలంలో తనిఖీలు నిర్వహించింది. పత్తికొండ డివిజన్‌లో వెంకటేశ్వర్లు, వెంకటప్రసాద్‌లతో కూడిన టీమ్ తనిఖీలు చేపట్టింది. విత్తన ప్రాసెసింగ్ యూనిట్లు, ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో కల్లూరు ఏవో విష్ణువర్ధన్‌రెడ్డితో కలసి తనిఖీలు నిర్వహించారు. శ్రీరామ అగ్రి జెనటిక్‌కు చెందిన పత్తి విత్తన ప్రాసెసింగ్ సెంటరులో తనిఖీలు చేపట్టారు. పరమేశ్వర ఏజెన్సీస్ ఎరువుల దుకాణంలో సరైన రికార్డులు లేనందున రూ.46700 విలువ సూక్ష్మపోషకాల అమ్మకాలను నిలుపుదల చేశారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాలతో పాటు ట్రాన్స్‌పోర్టు కంపెనీల్లోను తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో బాగంగా రికార్డులను, స్టాకు తదితర వివరాలను పరిశీలించారు.

దేవనకొండలో..

దేవనకొండ: దేవనకొండలో సోమవారం విత్తనాలు, పురుగుమందు, ఫర్టిలైజర్ షాపులను ఇన్‌ఫెక్షన్ సర్‌ప్రైజ్ స్క్వాడ్ అధికారి కె.ఐ.సుదర్శన్‌రాజు, విజిలెన్స్ ఎస్ఐ యు.వెంకటప్రసాద్ ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. పత్తికొండ ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్, దేవనకొండ ఏఓ ఉషారాణి పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల దాష్టీకం

- మహిళలపై కట్టెలతో దాడి
- ఇరువర్గాలపై పోలీసుల కేసు నమోదు



కట్టెలతో హల్‌చల్ చేస్తున్న టీడీపీ వర్గీయులు

తుగ్గలి: అధికారంలో ఉన్నామని, తమను ఎవరూ ఏమీ చేయలేరని టీడీపీ నాయకులు దాష్టీకం చేశారు. శభాష్‌పురం గ్రామంలో కర్రలతో మహిళలపై దాడి చేశారు. పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ వర్గీయుడు తిమ్మరాజు, టీడీపీ వర్గీయుడు చక్రాల్ల రంగస్వామి మధ్య రెండు రోజుల క్రితం మద్యం విక్రయంపై వాగ్వావాదం జరిగింది. మొహర్రం పండుగ నేపథ్యంలో గ్రామంలో ఘర్షణ వద్దని పలువురు వారించడంతో సర్దుకున్నారు. పండుగ ముగియడంతో సోమవారం పికెట్ పోలీసులు టీడీపీ వర్గీయుడు రంగస్వామిని తీసుకొచ్చి పాఠశాల వద్ద ఉంచారు. విషయం తెలుసుకున్న టీడీపీ వర్గీయులు సూరన్నతో పాటు మరికొందరు కట్టెలతో హల్‌చల్ చేస్తూ తమపైనే పోలీసులకు ఫిర్యాదు చేస్తారా అంటూ తిమ్మరాజు, సోదరుల ఇళ్ల వద్దకెళ్లి హల్‌చల్ చేశారు. భయబ్రాంతులకు గురైన తిమ్మరాజు, సోదరులు పారిపోయారు. ఇంట్లో ఉన్న తిమ్మరాజు సోదరుడు శ్రీనివాసులు భార్య సుధామణి, ఆమె తల్లి దండ్రులు(చందోలి)పై దాడి చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. పండుగ రోజు కొత్తబురుజుకు చెందిన మేలగాడి అన్నం పెడుతుండగా టీడీపీ వర్గీయులు అనవసరంగా దుర్భాషలాడుతూ ఘర్షణ సృష్టించారని వైఎస్సార్‌సీపీ వర్గీయులు ఆరోపించారు. శభాష్‌పురం గ్రామంలో ఘర్షణకు సంబంధించి తిమ్మరాజు, అతని సోదరుడుపై, అలాగే రంగస్వామి, మరొకరిపై కేసు నమోదు చేసినట్లు తుగ్గలి ఎస్ఐ బాల నరసింహులు తెలిపారు.

జల్సాల కోసం 'దోపిడీ' బాట

- ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు
- అరెస్టు అయిన వారిలో ఇద్దరు మైనర్లు
- బాల నేరస్తుల శరణాలయానికి అప్పగింత



దోపిడీ దొంగలను అరెస్టు చూపుతున్న పోలీసులు

కర్నూలు: ఉన్నత విద్య అభ్యసించి కుటుంబానికి అండగా ఉండాల్సిన వారు మద్యానికి, జల్సాలకు అలవాటు పడ్డారు. ఇందుకు కావాల్సిన డబ్బుల కోసం 'దోపిడీ' బాట పట్టారు. కారులో ప్రయాణికులను ఎక్కించుకుని దోపిడీకి పాల్పడుతూ పోలీసులకు పట్టుబట్టారు. కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ తెలిపిన వివరాలు.. దేవనకొండ మండలం తెర్నేకల్లు గ్రామానికి చెందిన జొహరాపురం నూర్ బాషా ఈనెల 5వ తేదీ తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి కర్నూలు చేరుకున్నాడు. స్వగ్రామానికి వెళ్లేందుకు కర్నూలులోని బళ్లారి చౌరస్తా వద్ద నిలబడి ఉన్నాడు. కర్నూలు వాసవీనగర్‌కు చెందిన రమేష్ (20), కర్నూలు అశోక్ నగర్, గీతా నగర్‌కు చెందిన మరో ఇద్దరు మైనర్లు కారులో వచ్చి తాము బళ్లారికి వెళ్తున్నాం అంటూ నూర్‌బాషాను ఎక్కించుకున్నారు. తొలుత రూ.100 అవుతుందని నమ్మించారు. కొద్ది దూరం వెళ్లిన తర్వాత చంపుతామని బెదిరించి రూ.6,500 నగదు, సెల్‌ఫోన్, ఏటీఎం కార్డు, పాన్ కార్డు, క్రెడిట్ కార్డు బలవంతంగా లాక్కున్నారు. ఫోన్ పే నంబర్ తెలుసుకుని మరో రూ.12,000 అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. నెరవాడ గ్రామ సమీపంలో కారు నుంచి బయటకు తోసేసి వెళ్లిపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగలాపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని పక్కా ఆధారాలతో కల్లూరు మండలం లక్ష్మీ జగన్నాథగట్టు కోనేరు వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నారు. సోమవారం కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ ఎదుట హాజరుపర్చారు. కర్నూలు రూరల్ తాలూకా సీఐ చంద్రబాబు నాయుడు, నాగలాపురం ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డితో కలసి డీఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. నిందితులు తాగుడు, జల్సాలకు అలవాటు పడి ఖర్చుల కోసం ప్రయాణికులను తమ కారులో ఎక్కించుకుని దోపిడీకి పాల్పడేవారని తెలిపారు. ఇందులో ఇద్దరు మైనర్లు ఉండటంతో బాల నేరస్తుల శరణాలయానికి అప్పగించినట్లు తెలిపారు. నిందితుల నుంచి దోపిడీ సొమ్ము రూ.11,800, నేరానికి ఉపయోగించిన కారును సీజ్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు.